క్లుప్తంగా

నిత్యావసర వస్తువులు అందజేత

గురజాల: స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను శనివారం అందజేశారు. మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కావూరి రామారావు ప్రతి నెలా నిత్యావసర వస్తువులు అందించే విధంగా ప్రణాళిక రూపొందించారు. జంపాని అమరలింగారావు, లేళ్ల సాంబశివరావు, గూడూరి జానకీరామ్, నిర్వాహకుడు ఏసయ్య ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మాచర్ల : పట్టణంలోని రామా టాకీస్ సెంటర్‌లో ఉన్న భార్గవి ఆసుపత్రి నిర్వాహకుల కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. వైద్యులు డాక్టర్ కె.పి.చారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు ఉచితంగా షుగర్, బీపీ, పరీక్షలు చేశారు. ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 250 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. మందులు పంపిణీ చేశారు.

ఫైర్ సేఫ్టీ తప్పనిసరి



పిడుగురాళ్ల: ఫైర్ సేఫ్టీ రూల్స్‌ను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని పిడుగురాళ్ల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పలు ప్రైవేటు వైద్య శాలలకు తమ సిబ్బందితో ఎలక్ట్రికల్ ఫైర్ సేఫ్టీకి సంబంధించి పలు జాగ్రత్తలతో కూడి బ్రోచర్‌ను ప్రైవేటు హాస్పిటల్‌కు అందించడం జరిగిందని తెలిపారు. అన్ని కార్యాలయాల్లో, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దాచేపల్లి: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సౌందర్య రాజన్ శనివారం తెలిపారు. గురజాలకు చెందిన వీరమల్ల రాంబాబు ఈ నెల 26న గురజాల నుంచి రామాపురం వెళ్లాడు. కానీ, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌందర్య రాజన్ వెల్లడించారు.

జేఎన్‌టీయూకే వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలి

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ కళాశాల వద్ద బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ వినుకొండ-నరసరావుపేట రోడ్డులోని కాకాని జేఎన్‌టీయూఎన్ కళాశాల వద్ద బస్‌స్టాప్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల నుంచి రోడ్డు మీదకు వచ్చిన విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తుందన్నారు. ఎండైన, వానైన రోడ్డు మీదనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పోలీసు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు సాయి ప్రణీత, ఆదర్శ, ప్రణీత్, ప్రియా, కీర్తి లిఖిత తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో డీఎస్పీ తనిఖీ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ఐనవోలు పోలీస్‌స్టేషన్ నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, కేసుల యొక్క సీడీ ఫైల్స్‌లను పరిశీలించారు. ఎస్ఐకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీ కె. శ్రీనివాసరావు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీతో మేము కార్యక్రమం గురించి వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడదతో బెంబేలు



మాచర్ల రూరల్: పట్టణంలో పెరుగుతున్న కోతుల బెడదతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని 12, 13, 14 వార్డుల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇంటి తలుపు తెరిస్తే చాలా లోపలకు కోతులు ప్రవేశించి నిత్యావసర సరుకులు, పప్పులు తీసుకెళ్లడమే కాకుండా, పిల్లలు, వృద్ధుల పై దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల గుంపు పెరగటంతో వాటి బారి నుంచి రక్షించుకునేందుకు.. అనేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంటి చుట్టూ గ్రిల్స్ పెట్టించుకుని రక్షణ పొందుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు వినతి పత్రాల ద్వారా విన్నవించినా..స్పందించడం ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతుల దాడిలో చాలా మంది గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రామా టాకీస్ వీధిలో ఒక మహిళ ఇంటిపై దుస్తులు ఆరవేస్తూ కోతుల దాడితో.. డాబా మీద నుంచి పడి మరణించారు. ఈ వీధుల్లోనే నివసించే మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వీటి నివారణకు కనీసం చర్యలు తీసుకోకపోవడంపై.. ఆ ప్రాంతం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పుర పాలక శాఖాధికారులు స్పందించి కోతులను పట్టించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు

హైవేలో కనిపించని సూచిక బోర్డులు



రాయవరం జంక్షన్‌లో కనిపించని సూచిక బోర్డు

మాచర్ల రూరల్: మాచర్ల పట్టణంలో నిర్మితమవుతున్న జాతీయ రహదారులకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కోట్లాది రూపాయల నిధులతో రెండు వరుసల రహదారులను ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో భారీ వాహనాలు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మాచర్ల సమీపంలోకి వచ్చే వాహనాలు పట్టణంలోకి రావాలన్నా, హైవే రోడ్డులో వెళ్లాలన్నా.. జంక్షన్ రహదారిలో ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు అర్థం కాక హైవేలో 2 కిలోమీటర్ల దూరం వెళ్లి రహదారి నిర్మాణ పనులు జరుగుతుండటంతో వెనక్కు వస్తున్నారు. ఇదే సమయంలో రహదారి మార్గం మధ్యలో ఎటువంటి సూచిక బోర్డులో ఏర్పాటు చేయలేదు. ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనటంతో పాటు, మలుపు గమనించలేక వాహనాలు బోల్తాపడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ భద్రతా చర్యల హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా నిర్వాహకులు సూచిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీలు

మాచర్ల రూరల్: వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టిందుకు అంగన్‌వాడీ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కిశోర్ వికాస్, బాల్య వివాహాలపై అవగాహన సదస్సును ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేక చిన్న వయసులోనే వివాహం చేస్తుంటారన్నారు. అలాంటి వారిని గుర్తించి చిన్న వయసులో వివాహాలు జరిపితే ఆడపిల్లలకు తలెత్తే ఆరోగ్య సమస్యలు వివరించాలన్నారు. అలాగే మానసిక ఒత్తిడి తట్టుకోలేక జరుగుతున్న ఆత్మహత్యల పైనా అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన తర్వాత బాలికలకు, 21 సంవత్సరాలు నిండిన తర్వాత బాలురకు వివాహం చేయాలన్నారు. సూపర్‌వైజర్ మాచర్ల జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, సునీత, జి.మల్లేశ్వరి, నాగేంద్రం, శివపార్వతి పాల్గొన్నారు.

చాంబర్ ఎన్నికలకు కదలిన వ్యాపారులు



ఎలక్షన్స్‌కు వెళ్తున్న వ్యాపారులు

మాచర్ల: గుంటూరులో శనివారం జరిగిన చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎలక్షన్స్‌కు పట్టణం నుంచి ఆర్య వైశ్య వ్యాపారులుతో పాటు పలువురు వ్యాపారులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అందుకే ప్రతి సభ్యుడు ఈ ఎన్నికలలో పాల్గొని తమ ఓటును వేయటం సంతోషకరమన్నారు. నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు సూరె యలమంద మాట్లాడారు. ఎన్నికల్లో రంగా బాలకృష్ణ, యేల్చూరి వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా పోటీ చేస్తున్న నేపథ్యంలో సుమారు 3వేల మందికి పైగా వ్యాపారులు పాల్గొని, తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషకరమన్నారు. ఆర్యవైశ్యులు మేడం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పోలా సత్యం, పుల్లారావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, యరబోతుల కోటేశ్వరరావు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి

సత్తెనపల్లి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పాటుపడుతుందని అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు అన్నారు. ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి మణిరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న షేక్ ఖాశిం బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిట్టిబాబు వచ్చారు. ఇరువురిని పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే అసోసియేషన్‌కు నూతనంగా మహిళా ఉపాధ్యక్షురాలి స్థానం కేటాయించడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని పీపీ యూనిట్‌లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న ఎస్.కుసుమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సెక్రటరీ ఎస్.అంబేడ్కర్, ట్రెజరర్ కోటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ రవిచంద్ర కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎస్.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



పిడుగురాళ్ల: రక్తదానం చేస్తే.. ప్రాణదానం చేసినట్లేనని పిడుగురాళ్ల రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ, శ్రీ వెల్ఫేర్ సొసైటీ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ... రక్తదానం కార్యక్రమానికి విశేష స్పందన ఉంటుందని తెలిపారు. స్కాలర్ డిగ్రీ కాలేజీ, కేఎస్ఆర్ విద్యా సంస్థల నుంచి హాజరై రక్తదానాన్ని అందించటం ఎంతో ఆనందమన్నారు. వికాస హాస్పిటల్ అధినేత డాక్టర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ పిల్లి చెన్నారావు, డాక్టర్ విష్ణుబాబు రక్తదానం చేసి, పలువురికి ఆదర్శంగా నిలిచారు. స్కాలర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఆవుల్ జనార్దన్, కోనేటి నరసింహారావు పాల్గొన్నారు.

శరీరం, మనస్సు ఏకం చేసేది యోగ



నరసరావుపేట ఈస్ట్: శరీరం, మనస్సును ఏకం చేసేది యోగ అని మంగళగిరి శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం ప్రధానాచార్యులు వేంకటేశ్వరరావు గురూజీ తెలిపారు. యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించిన 182వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా వెంకటేశ్వర గురూజీ అభ్యాసకులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శిబిరానికి ప్రతిరోజూ హాజరైన వారికి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో యోగా గురువు కె.వెంకటజనార్దనరావు, కన్వీనర్ కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగశిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 28రోజుల పాటు ఉచిత యోగశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్ రిక్షాసెంటర్‌లోని మాగులూరి వెంగళరెడ్డి బిల్డింగ్ అక్షర స్కూల్ ఆవరణలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్యనమస్కారాలు, ఆహార నియమాలు బోధించనున్నట్టు తెలిపారు. 8 నుంచి 80సంవత్సరాల వయస్సు ఉన్నవారు యోగా అభ్యసించవచ్చని తెలిపారు. వివరాలకు 9247191553కు సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డీటీ బ్రహ్మయ్య



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాషా

పాలువాయి(రెంటచింతల): ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య అన్నారు. శనివారం పాలువాయి గ్రామంలో సర్పంచ్ మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలకు ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గ్రామస్తులు 6 అర్జీలు అందచేసినట్లు తెలిపారు. ఆర్ఐ పల్లా రామకృష్ణ, ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, మండల సర్వేయర్ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామ సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ బాషా పాల్గొని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ గ్రామ సభలో 10 అర్జీలు వచ్చాయని తెలిపారు. గ్రామ సభల్లో వచ్చే అర్జీలను ఆన్‌లైన్ చేసి, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సీనియర్ అసిస్టెంట్ వలి, వీఆర్ఓ కోటేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ చింతా నాగ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మకట్‌లాల్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

మాచర్ల రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ బత్తుల వాణి కోరారు. శనివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. భూ వివాదాలు సరిహద్దు సమస్యలు, మ్యూటేషన్లు, 22ఏ, దేవాదాయ శాఖలో సమస్యలపై రైతులు అర్జీలు అందించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. సదస్సులో 15 అర్జీలు అందినట్లు తెలిపారు. దేవదాయ శాఖ ఏఓ సాంబశివరావు, ఆర్ఐ భాస్కర్, విఆర్ఓ చిరంజీవి నాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో పులకించిన పాలువాయి



పడిపూజలో కళాకారుడి ప్రదర్శన



విశేషంగా ఆకట్టుకున్న అయ్యప్పపడి పూజ మండపం

పాలువాయి(రెంటచింతల): మండలంలోని పాతపాలువాయి గ్రామం శనివారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో పులకించిపోయింది. గ్రామంలో అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి బొద్దూరి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో జిగురు చంద్రశేఖరశర్మ, జిగురు ప్రసాద్‌శర్మ, జిగురు శంకర్ శర్మ, వెల్లటూరి నాగేశ్వరశర్మ, అనిల్ కుమార్ శర్మ అయ్యప్పస్వామికి 18 రకాల పంచామృతాభిషకాలతో పాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టారు. వందలాది మంది శరణం అయ్యప్ప.. నామ స్మరణతో పాతపాలువాయి పులకించి పోయింది. అయ్యప్ప జీవిత చరిత్రకు సంబంధించిన పాటలతో హోరెత్తించారు. పాల్గొన్న వందలాది మంది స్వాములు భజనతో తన్మయత్వం చెందారు. శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా భక్తి భావం నెలకొంది. అర్ధరాత్రి ఏర్పాటు చేసిన భగభగమండే హోంగుండంలో పలువురు భక్తులు నడిచి తమ భక్తి భావాన్ని చాటారు. అయ్యప్పస్వామి మండపం, 18 మెట్లు విశేషంగా గ్రామస్తులను ఆకర్షించాయి. స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏపీఆర్ జూనియర్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విజయపురిసౌత్: ఏపీఆర్ జూనియర్ కళాశాలలో 1997–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. 25 ఏళ్ల క్రితం ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసిన 65 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం.. పరస్పర పలకరింపులు, యోగ క్షేమాలు, కుశ ప్రశ్నలతో సందడి వాతావరణం నెలకొంది. తమ అధ్యాపకులు ఎస్.రామలింగరాజు, రామదాస్, ఆనంద్ కుమార్, వీరబంధం, నాగరాజరావు, కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సరోజిలను ఘనంగా సత్కరించారు. తమ గురువులు నేర్పిన క్రమ శిక్షణ, చదువుతో వివిధ స్థాయిల్లో ఉన్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కిషన్ సింగ్, రాకేష్, తండన్, భరత్, నాగరాజు, రమేష్ నాయుడు, అనూక్ పాల్గొన్నారు.

పిన్నెల్లి లక్ష్మమ్మ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన పిన్నెల్లి లక్ష్మమ్మ (90) మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మమ్మ కుటుంబం మొదటి నుంచి తమ కుటుంబానికి ఎంతో మద్దతిస్తోందన్నారు. వైఎస్సార్ అంటే ఎంతో గౌరవమన్నారు. ఆమె లేని లోటు పార్టీకి తీరనిదన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ విజనరీ విభాగం జిల్లా కార్యదర్శి దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పిన్నెల్లి వెంకటరెడ్డి, రవీంద్రానాయక్, బూడిద శ్రీను, మద్దికర శ్రీనివాసరెడ్డి, చిలకల గురవారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెదకూరపాడు: ఇంట్లో రాత్రి సమయంలో భోజనం చేస్తున్న వ్యక్తిపై మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని బలుసుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బలుసుపాడు గ్రామంలో ఈనెల 26వ తేదీన గ్రామానికి చెందిన మంటి గిరిబాబు రాత్రి పది గంటల సమయంలో తన ఇంట్లో భోజనం చేస్తుండగా ఇదే గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు, సాయి, గోపి, తిరుపతిరావు, శ్రీను, దాసు అనే వ్యక్తులు వచ్చి ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేసి కత్తులతో దాడి చేస్తుండగా బాబు బిగ్గరగా కేకలు వేయటంతో నిందితులు పరారైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

సొసైటీ సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

- ముమ్మరంగా ఈకేవైసీ కార్యక్రమం
- సొసైటీలో సభ్యులకు తప్పనిసరి



అమరావతిలోని నెమలికల్లు, ఉంగుటూరు, వైకుంఠపురంలో.. సొసైటీ సభ్యులకు ఈకేవైసీ నమోదు

రొంపిచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు. సభ్యుల షేర్ ధనం, డిపాజిట్లు, లోన్ అకౌంట్‌లను ప్రభుత్వం డిజిటలైజేషన్ చేస్తుంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 పీఏసీఎస్‌లో ఉన్న ఖాతా దారులందరికీ అకౌంటులను ఆధార్ కార్డులతో లింక్ చేసి, ఈకేవైసీ చేయాలని ప్రభుత్వానికి నబార్డ్ సూచించింది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదైన 79,624 మంది సభ్యులకు ఆధార్, సేవింగ్ అకౌంట్‌లతో లింక్ చేయటంతో పాటు ఈకేవైసీ చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కంప్యూటరీకరణ కార్యక్రమం వేగవంతంగా కొనసాగించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందితో పాటు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని కూడా బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 అర్బన్, రూరల్ ఏరియాల్లో 79,624 మంది ఉండగా నరసరావుపేట మండలంలోని సంఘాలలో 5030 మంది సభ్యులు ఉండగా, ఈపూరులో 2157, నాదెండ్లలో 3154, చిలకలూరిపేట రూరల్‌లో 2408, రొంపిచర్లలో 4092, మాచర్ల అర్బన్‌లో 623, కారంపూడి 1800, నరసరావుపేట అర్బన్ 1302, చిలకలూరిపేట అర్బన్ 1022, శావల్యాపురం 3813. నూజెండ్ల 2276, గురజాల 3195, బొల్లాపల్లి 1628, సత్తెనపల్లి అర్బన్ 462, ముప్పాళ్ల 2096, యడ్లపాడు 4082, మాచవరం 1419, క్రోసూరు 1741, వినుకొండ 1693, పెదకూరపాడు 2469, దాచేపల్లి 3190, పిడుగురాళ్ల 3265, నకరికల్లు 3692, వెల్దుర్తి 1846, రెంటచింతల 2747, సత్తెనపల్లి రూరల్ 4297, దుర్గి 2169, అచ్చంపేట 2448, వినుకొండ అర్బన్ 938, బెల్లంకొండ 899, మాచర్ల 1258, పిడుగురాళ్ల అర్బన్ 832, అమరావతి 4212, రాజుపాలెం మండలంలో 1069 మంది సభ్యులు ఉన్నారు. వీరందరి పేర్లు వారి వారి ఆధార్ కార్డులతో నమోదు చేశారు. గత వారం రోజులుగా గ్రామ సచివాలయాలు, సొసైటీల సభ్యులతో కళకళలాడుతున్నాయి. ఈకేవైసీ కార్యక్రమం మరింత వేగవంతంగా సాగేందుకు సచివాలయాల పరిధిలోని సంఘాల సిబ్బందికి కూడా సచివాలయాల సిబ్బందితో కలిసి పని చేయాలని జిల్లా సహకార శాఖ అధికారులు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.

ప్రతి సభ్యుడికి ఈకేవైసీ తప్పనిసరి



సహకార సంఘాల్లో సభ్యులైన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. సచివాలయం సిబ్బంది తమ ఇంటికి వచ్చినప్పుడు గానీ, సభ్యులు సచివాలయానికి వెళ్లైనా సరే తమ అకౌంట్‌లతో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సొసైటీల సిబ్బంది సచివాలయాల సిబ్బందితో సమన్వయంగా పని చేయాలన్నారు.

– ఎం. వెంకటరమణ, జిల్లా సహకార శాఖ అధికారి

రేపు మున్సిపల్ అత్యవసర సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం పుర పాలక సంఘం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల పై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.